
# ఊతకర్ర

డి.ఆర్.ఇంద్ర



పొద్దుటే చాలాచలిగా ఉన్నా అలవాటుచొప్పున చన్నీళ్లతో స్నానించి నా రీసెర్చి పేపర్లతో కుస్తీలో పడ్డాను.తనరూంలో నాకు ఆశ్రయమిచ్చిన రెడ్డి వచ్చే టైం అయింది.రెడ్డి రాత్రిళ్లు రూం లో ఉండడు.పులి రాత్రంతా వేటాడి పగలంతా నీడపట్టున విశ్రమించి నట్టు రెడ్డి రాత్రిళ్లు తన 'ఆ వేట' ముగించుకుని ఉదయం రూంకి చేరుకుంటాడు.రేడియోలో నాకిష్టమైన నాదస్వరం మధురంగా వినిపిస్తోంది.రెడ్డే కనుక ఉదయమే రూంలో ఉంటే నాకు నాదస్వరం వినే అదృష్టంవుండదు.అతని పి-పి స్టీరియోసిస్టంలోంచి గుండెలదిరేలా,చెవులు చిల్లులు పడేలావచ్చే మైఖేల్ జాక్సన్ వికారపు వికృత అరుపుల శబ్దాలతో నా బి.పి పెరిగేది.నా చన్నీటిస్నానాల్ని,నాదస్వరం వినడాన్ని వెటకరిస్తాడు రెడ్డి."ఆ చన్నీళ్లు పోసుకోవడం ఎందుకు? పాతికేళ్ల వయసులోఉండి డెభ్భైఏళ్ల ముసిలాడిలా ఆ క్లాసికల్ మ్యూజిక్ మహదానందంగావింటూ తలాడించడం ఏంటి?" అంటాడు.చన్నీటి స్నానంఇచ్చే చురుకుదనం,ఆరోగ్యం వేసవిలో కూడా వేడినీళ్లగుమ్మరించుకునే రెడ్డిలాంటివాళ్లకి తెలియడం అసంభవమే.నిజానికి రెడ్డితో స్నేహించడానికి నాకూ అతనికీ కలిసే కామన్‌విషయాలేమీ లేవు.

అంతేకాక జీవన విధానాలలో ఇద్దరమూ ఉత్తర దక్షిణ ధృవాలమే.మా ఆర్థిక అంతస్థులు వేరైనా, మిత్రులం కాబట్టి యూనివర్సిటీలో నా రీసెర్చిస్టడీస్ కొనసాగిస్తూ రెడ్డి ఆహ్వానంమీదే అతని రూంలో ఉంటున్నాను.రెడ్డికి నాలా చదువుకుని ఉద్యోగం సంపాదించుకోవాల్సిన అవసరంలేదు.రైస్‌మిల్లులూ,పెట్రోల్‌బంకులూ,సినిమాథియేటర్లు,చిట్‌ఫండ్ కంపెనీలు లెక్కకి మిక్కిలిగా ఉన్నకొంపలు, పుట్టాక అటువంటి వారికి చదువు కాలక్షేపానికీ,జీవితాన్ని అనుభవించడానికే పరిమితమౌతుంది.సాగుబడి ఉన్నవాళ్లెవరైనా రెడ్డికి భిన్నంగావ్యవహరిస్తే ఆశ్చర్యమే. "ఆ ఒక్క విషయంలో తప్ప నాలో ఏం చెడుచూసావ్ చెప్పు బ్రదర్?" అంటాడు రెడ్డి.నిజమే,రెడ్డికి ఆడపిచ్చి తప్పించి మరే లొసుగూ లేదు. కానీ ఆ ఒక్క వ్యసనమూ చాలు-మనిషిని పశుస్థాయికి దిగజార్చడానికి అంటాను. రెడ్డి చస్తే ఆ మాట ఒప్పుకోడు."నేను ఏ ఆడపిల్లనీ చెరచను.సామ,దాన భేదోపాయాలతో లొంగదీసుకుంటాను.అయినా కాసుల గలగలలకి లొంగని ఆడదెవర్తివుంటుందోయ్?డబ్బుకి లోకం దాసోహం అనే మాటెరుగవా?" అంటాడు.రెడ్డి సాదా సీదా రూపంవున్న ఆడపిల్లల్ని కన్నెత్తి చూడడు-అందగత్తెల్ని తప్ప. అందం అతనికో అబ్సెషన్.

"పోనీ ఓ మాంచి అందగత్తెని చూసి పెళ్లాడేయరాదా రెడ్డీ? ఎందుకొచ్చిన ఈ చిలక కొట్టుళ్ళు?నీ ఆస్తి అంతస్థులకి చాలామంది అందగత్తెలే నీకోసం క్యూలు కడతారుకదా" అంటే రెడ్డి అంగీకరించడు.తనకి తగిన ఆడదంటే తన స్టేటస్‌కి తగినదై, ఏలోపమూలేని పెర్ఫెక్ట్ ఫిగరై,ఎలిజబెత్ టేలరూ,సోఫియా లారెన్స్‌ల అందాలు కలబోసినట్టుండే అందగత్తె అయివుండాలట! తీరా అటువంటి ఓ అందగత్తెని చూసి చేసుకున్నా ,అంతకన్నా మతిపోగొట్టే అందగత్తె కనుక తారసపడితే, ఈ మొదటి పిల్లని అనవసరంగా చేసుకున్నానే అని చింతించవలసివస్తుందట!అందుకే "పెళ్లి మన జీవితానికి సరిపడదు బ్రదర్.కనిపించిన అందగత్తెనల్లా ఓ చూపు చూడటమే,ఒక్కసారి అనుభవంచాలు.యూజ్ అండ్ త్రో షుడ్ బి అవర్ పాలసీ"అంటాడు."లోకంలో మగాళ్ళందరూ గొప్ప సౌందర్యవతుల్నే భార్యలుగా కావాలని కూర్చుంటే నూటికి తొంభైమందికి పెళ్ళిళ్ళే అవవు.అందగత్తెలుకాని భార్యలతో ఎవరూ ఆనందంగా జీవించడంలేదా?'' అని ప్రశ్నిస్తే రెడ్డి వూరుకోడు.ఈ విషయంపై వారంక్రితం జరిగిన వాదనలో ఎదురుదాడికి దిగాడు.

"ఆడవాళ్ళకి ఆమడదూరంలో వుండే నీకు అందమంటే ఏమిటో ఏం తెల్సు? పాతికేళ్ళొస్తున్నా ఆడస్పర్శే ఎరగని ముదురు ఘోటకబ్రహ్మచారివి! ఎపుడైనా ఏ ఆడదైనా నీ కంటికి అందంగా కన్పించిందా? ఏ ఆడపిల్లనైనా మళ్ళీ మళ్ళీ వెనక్కి తిరిగి చూసావా? అందానికి స్పదించలేని మనిషివి! నీకు - ఎండిపోయిన చెట్టుకీ తేడా ఏమిటి బ్రదర్?" చాల హేళనగా అన్నాడు రెడ్డి.

నేను మాట్లాడకుండా నా జేబులోని పర్స్‌లోం ఫోటో ఒకటి తీసి రెడ్డి చేతిలో పెట్టాను. ఆ ఫోట వంక రెడ్డి పరిశీలనగా చూసి నావంక విస్మయం చూసాడు.

"ఈ పొట్టి అనాకారి పిల్ల ఎవరు?" ఆశ్చర్యంగా డిగాడు.

"నా మేనమామ కూతురు కాత్యాయిని - నా బోయే భార్య." చెప్పాను.

రెడ్డి నన్నో వింత జంతువుని చూసినట చూసాడు.

"ఈ అనాకారి పిల్లా నీ సెలక్షన్! ముఖం నిం కాలిన మచ్చల్తో వికృతంగా వున్న ఈ పిల్లా నీ బోయే భార్య? ఏ యువకుడైనా తన అందం లేకపోయినా, తన భార్యమాత్రం రంభలా వుండాలని

కోరుకుంటాడు. కానీ నువ్వందుకు విరుద్ధంగా ఏరికోరి అందవిహీనతని ఎంచుకోవడం ఏమిటి? నీలో ఏదో లోపం వుంది. ఐ కెనాట్ బట్ పిటీ యువర్ సెలెక్షన్!" రెడ్డి గొంతులో వెటకారం దాగ లేదు.

"రెడ్డీ నువ్వు మీ అమ్మగార్ని ప్రేమిస్తావా?" ఫొటోని అందుకుని పర్స్‌లో పెట్టుకుంటూ అడిగాను.

"ఏమిటి పిచ్చి ప్రశ్న? మా అమ్మంటే నాకు ప్రాణం!" చెప్పాడు రెడ్డి.

"మీ అమ్మగారు అందంగా వుంటారా రెడ్డీ?"

రెడ్డి కనుబొమలు ముడిపడ్డాయి. "అదేం ప్రశ్న? మా అమ్మ అందగత్తేమీ కాదు. చాలా సాదాసీదా పల్లెటూరి మనిషి."

మా అందం ప్రసక్తి దేనికి?"

"మరి - అందగత్తె కాని తల్లిని ఎలా ప్రేమిస్తున్నావ్ రెడ్డీ?"

"వాడ్డుయూ మీన్?" కోపంగా అన్నాడు రెడ్డి.

"నీ తల్లిని ప్రేమించడానికి, ప్రాణంగా అభిమానించడానికి ఆవిడ సాదాసీదా నీకడ్డు రాలేదు. ఎవరైనా తన తల్లి అందగత్తె అయితేనే ప్రేమించి, కాకపోతే మానేస్తారా? అసలు తన తల్లి అందగత్తె అవునా కాదా అని ఎవరైనా ఆలోచిస్తారా? అబ్సర్డ్ కదూ? అమ్మని ప్రేమించడానికి ఆవిడ అందంతో పనిలేదు. అమ్మ ఎలావున్నా అమ్మే. ఏభాషలో ఐనా అమృతం లాటిమాట ఏదైనా వుందంటే అది అమ్మ అనేమాట ఒక్కటే కదూ. అందంతో సంబంధం లేకుండా అమ్మని ప్రేమించేటపుడు - అలాగే అందంతో సంబంధం లేకుండా జీవితభాగస్వామిని ప్రేమించడానికేం?

కాత్యాయని నా మేనమామ కూతురు. ఆ పిల్లపుట్టగానే నాకు పుట్టిందన్నారు. నాకపుడు ఏడేళ్ళు. ముట్టుకుంటే కందిపోయేలా, లక్కపిడతకన్నా చిన్న నోటితో, చిన్నచిన్న కాళ్ళూ చేతులాడిస్తూ రబ్బరుబొమ్మలావున్న ఆపిల్ల నాకోసం పుట్టిందని తెలవగానే నాకు కలిగిన సంబరం అంతాఇంతా కాదు. ఎవరూ చూడకుండా ఆ పిల్లని ఎన్నిసార్లు ముద్దులు పెట్టుకునేవాడినో, కితకితలు పెట్టి నవ్వించేవాడినో! నాది అనేదాని మీద మనిషికి వుండే మమకారం అటువంటిది కాబోలు! కాత్యాయని కూడా నా చిటికెన వేలు పట్టుకుని నా కూడా కూడా తిరిగేది. నా సమక్షమే ఆ పిల్లకి స్వర్గం.

కాత్యాకి పదమూడేళ్ళపుడు వంటింట్లో స్టౌవ్ పేలి ముఖమూ, వళ్ళూ తీవ్రంగా కాలింది. గాయాలు మానినా మచ్చలు మిగిలాయి. ఆ మచ్చలు చూసుకుని కాత్యాయని కుమిలికుమిలి ఏడ్చింది. ఆ మచ్చలు తెచ్చిన అనాకారితనం చూసి నేను తనని నిరాకరిస్తానేమోనని భయపడింది. కాత్యాని దగ్గరకు తీసుకుని ఓదార్చాను. ఆ మచ్చల్తో అనాకారితనం రావడంలో కాత్యా పాత్ర ఏముందని నిరాకరించాలి? మనిషిని ప్రేమించడానికి మచ్చలు అడ్డొస్తాయా? ఆ మచ్చలు అసహ్యంగా వున్నాయనే నాకెవుడూ అనిపించలేదు. మచ్చలు సూర్యుడికీ వున్నాయి, చంద్రుడికీ వున్నాయి. ఆ మచ్చల వల్ల వాటి విలువ, గొప్పదనం ఏవైనా తగ్గాయా? లేడికి అందం తెచ్చేది ఆవంటిమీద మచ్చలే! అందంతో సంబంధం లేకుండా నా అమ్మ నాకెంత ఆరాధ్యనీయమో, మచ్చల్తో అనాకారితనంతో సంబంధం లేకుండా కాత్యా కూడా నాకు అంతే ఆరాధ్యనీయం. మనసుని మత్తెక్కించి మైమరపించడమే స్త్రీ సాన్నిహిత్యపు చరమలక్ష్యమైతే - నా కాత్యా ముఖంలోకి చూస్తుంటే నాకు ఈ లోకమే గుర్తుండదు..."

రెడ్డి చాలా అసహనంగా తల విదిలించాడు.

"నువ్వెన్ని చెప్పు, మగాడికి ఆడదాని అందం ఇచ్చే కిక్ మరేదీ ఇవ్వలేదు. కంటికి కనిపించే రూపమే అనాకారమైనపుడు అంతరంగాల్లోకి దూరి మనసుల్ని ప్రేమిస్తాననడం చాలా హాస్యాస్పదం. సృష్టిలో అందానికి పరాకాష్ట స్త్రీ శరీరమే. ఆ అందాన్ని వశపర్చుకుని ఆనందించడమే నా ఫిలాసఫీ.

ప్రపంచంలో ప్రతి వస్తువుకీ ఒక వెల వుంటుంది. అలాగే ఆడదాని అందానికీ ఒక వెల వుంటుంది. ఏ అందాన్నైనా కొనుగోలు చేయచ్చు. కావల్సిందల్లా డబ్బు ప్లస్ ఎడ్వంచరస్ హార్టు. ఐనా జీవితాన్ని అనుభవించడం చాతకాక మడిగట్టుక్కూర్చునే నీలాటి వాళ్ళకేం తెలుస్తాయి బ్రదర్ ఈవిషయాలు..." సిగరెట్ ముట్టిస్తూ అన్నాడు రెడ్డి.

"మనం ఈ విషయంలో ఎపుడూ ఏకీభవించలేం రెడ్డీ. ఇక ఆటాపిక్ ఒదిలెయ్..."

"సరే, వదిలేస్తాను కానీ, నిన్న సాయంకాలం నిన్ను కలిసిన ఆ అందాల కుంటి చిలకెవరు?" పొగ రింగులుగా వదులూ అడిగాడు రెడ్డి.

"...ఎవరి గురించి అడుగుతున్నావ్? ...లతా? ఆ అమ్మాయికి చిన్నపుడు పోలియోవచ్చి ఒకాలు అవిటిదైందట. ఐనా పట్టుదలతో చదువుకుంటూ, ఖర్చులకోసం ఒకరిపై ఆధారపడకుండా వుండటానికి సోప్స్ రిప్రజెంటేటివ్‌గా పనిచేస్తోంది. కేవలం ఆపిల్ల ఆత్మవిశ్వాసాన్ని ఎంకరేజ్ చేయడానికే నాకు అవసరం లేకపోయినా తరచూ సబ్బులు కొంటున్నాను. ఆ పనిమీదే వస్తూంటుంది ఆపిల్ల..."

"కుంటిదైతేనేం, ముఖంలో స్పార్క్ వుంది. అటువంటి ఆర్థికావసరాలు వున్న ఆడపిల్లలైతే మరీ ఈజీగా నా లైన్లోకొస్తారు. ఆ పిల్ల ఎడ్రస్ చెప్పు, నా తంటాలేవో నేను పడతాను." సిగరెట్ నుసి రాలుస్తూ చెప్పాడు రెడ్డి.

"నీ పాపంలో నన్ను కూడా భాగం పంచుకొమ్మంటావా రెడ్డీ?"

"ఏం, అందాల్ని అందుకుని అనుభవించడం చాతకాని నీకు నా అదృష్టం మీద ఈర్ష్యగా వుందా? నువ్వు ఎడ్రస్ చెప్పకపోయినా ఆపిల్లని పట్టుకోగలను - నా సంగతి నీకు తెల్సుగా..."

"తెలుసు రెడ్డీ. అందుకే ఎడ్రస్ ఇస్తాను. ఆపిల్ల విషయంలో నువ్వు ఫెయిలైతే, ఇక అటువంటి వ్యవహారాల జోలికి పోనని మాట ఇస్తావా?"

"ష్యూర్! రెడ్డి మాట తప్పడు. రెడ్డి ఓటమి ఎరగడు కూడా." సిగరెట్ ఏష్‌ట్రేలో కుక్కుతూ చెప్పాడు.

నాదగ్గర లత ఎడ్రస్ తీసుకున్న రెడ్డి నిన్నరాత్రి పది గంటలకి నుడిగాలిలావచ్చి విలాసంగా నవ్వుతూ చెప్పాడు.

"లత గురించి ఆపిల్ల "అటువంటి బావతు" కాదని గొప్పగా సర్టిఫికెటిచ్చావ్ గుర్తుందా? ఆ సేల్స్ గర్ల్ తన కన్యాత్వాన్ని ఈ రాత్రికి నాకు వెయ్యిరూపాయలకి సేల్‌చెయ్యడానికి వప్పుకుంది తెల్సా? ప్రపంచంలో డబ్బుతో కొనలేని అందమంటూ ఏదీలేదని ఇప్పటికైనా అర్థమైందా?" గర్వంగా చెప్పాడు.

"లత...వప్పుకుందా?" విస్మయంగా అడిగాను.

"నిక్షేపంలా వప్పుకుంది. సేల్స్‌గర్ల్స్ వాళ్ల కంపెనీ ఉత్పత్తుల్ని మాత్రమే కాదు, వాళ్ళ వయ్యారాల్నీ, వంపుసొంపుల్నీ కూడా సేల్ చేస్తారు -లాభసాటి బేరమైతేనే అనుకో. కష్టపడకుండా సులువుగా డబ్బు సంపాదించేమార్గాలే గుట్టుగా దొరికితే మడిగట్టుకుని కూర్చునే వాళ్ళెవరుంటారు - నీలాటి వెర్రి వెంగళప్పలు తప్ప. ఒక గంటసేపు తనవంటిని అద్దెకిచ్చినందుకు వెయ్యిరూపాయలు సంపాదించుకునే అవకాశాన్ని కాలదన్నుకుని ఈ లతలూ, పీతలూ పాతివ్రత్యాలని నెరుపుతారనుకుంటున్నావా పూర్‌ఫెలో? కుంటికాలితో ఎన్ని కొంపలకి తిరిగి ఎన్ని సబ్బులమ్ముకుని ఎన్నాళ్ళకి వెయ్యిరూపాయలు కళ్ళ చూడగలదు? అందుకే, మొదట తను అటువంటిదాన్ని కాదని బెట్టుసరి చేసినా, కొంచెం వత్తిడి చేసేసరికి మొహమాటం పడ్తూనే ఒప్పేసుకుంది - ఆఫ్‌కోర్స్ ఒక షరతుమీదే అనుకో."

"షరతా! ఏమిటది?"

"ఈవిషయం ఎవరికైనా తెలిస్తే తనపరువు పోతుంది కాబట్టి లాడ్జీలకి రాదట. తన ఫ్రెండ్, మరో సేల్స్‌గర్ల్ ఇంట్లో, అది కూడా అర్థరాత్రి ఓ గంట కేటాయించగలదట. నాక్కావల్సింది ఆ పిల్లతో ఒక్కసారి అనుభవం. ఆపిల్ల షరతు ఓకే చేసేసాను. ఇపుడేమంటావ్?" కళ్ళనిండా గర్వం తొణికిసలాడుతుండగా చెప్పాడు కొత్తడ్రెస్ తీసి తొడుగుతూ.

"నీ అదృష్టాన్ని నిజంగా అభినందిస్తున్నాను రెడ్డీ. ఆడమనస్తత్వాలని కాచివడబోసావ్! విష్యూబెస్టాఫ్ ఎంజాయ్‌మెంట్!" రెడ్డి హాండ్ షేక్ చేస్తూ చెప్పాను.

రెడ్డి ఇంటిమేట్ సెంట్ స్ప్రే చేసుకుంటూ విలాసంగా నవ్వాడు.

"దేనికైనా పెట్టిపుట్టాలోయ్. అందగత్తెల్తో వ్యవహారాలు నడపడమంటే ఓ మూలకూర్చుని రీసెర్చి పేపర్లు సబ్మిట్ చెయ్యడం కాదు. టాక్టిక్స్ వుండాలి, గట్స్ వుండాలి...మరి వస్తానూ. నా అదృష్టం నీకు నిద్రపట్టనీయకపోతే, నీ అనాకారి మరదలి ఫొటో గుండెల మీద పెట్టుకుని కలలు కను పూర్‌ఫెలో, గుడ్‌నైట్!" బూట్లు టకటకలాడిస్తూ బయటకు నడిచాడు రెడ్డి.

నా గుండెలమీద పర్స్‌లోంచి కాత్యా గిలిగింతలు పెడ్తూంటే, పుస్తకం మూసేసి నిద్రాదేవత వడిలో వదిగిపోయాను.

---- ---

రేడియోలో వార్తలు పూర్తవుతుంటే తుఫాన్లా వచ్చాడు రెడ్డి. మనిషి తూగిపోతున్నాడు. కళ్ళెర్రగా చింతనిప్పుల్లా వున్నాయి! విస్ఫోటనానికి ముందు దట్టంగా పొగలసెగలు కక్కే అగ్నిపర్వతంలా వున్నాడు! అంత చలిలోనూ చెమటలు కారుస్తున్నాడు.

నా గుడ్ మార్నింగ్‌ని రిసీవ్ చేసుకోలేదు. నా కుర్చీ పక్కన వున్న ట్రాన్సిస్టర్‌ని ఓ తన్ను తన్నాడు.

నా భుజాలు పట్టుకుని ఆవేశంలో పిచ్చిగా కుదిపేసాడు.

" ఆ ఛీట్ నన్ను...నన్ను మోసం చేసింది! అది...కోరుకుంది దొరికితే ఆ రెండో కాలుకూడా విరిచేసి పూర్తికుంటిదాన్ని చేసి గుణపాఠం నేర్పి వుండేవాడ్ని... ఆ కుంటి దానికెంత ధైర్యం నన్ను మోసం చెయ్యడానికి? హౌడేర్ షి ఇన్సల్ట్ మి!...ఐ విల్ కి...కి...కిల్‌హర్..."కోపంతో మాటలు రాక తడబడుతున్నాడు.

"అసలు ఏం జరిగింది రెడ్డీ? ఆ పిల్ల నిన్ను ఛీట్ చెయ్యడవేమిటి? కూల్‌డౌన్..." రెడ్డిని కుర్చీలో కూర్చోపెడుతూ అడిగాను.

తల రెండు చేతుల్తోనూ పట్టుకున్నాడు రెడ్డి. "ఛ! ఇంటింటికీ తిరుగుతూ సబ్బులమ్ముకునే ఓ కుంటిది నన్నింత దారుణంగా ఛీట్ చెయ్యడమా!? నన్నిలా మోసం చేసి ఆటపట్టించే సాహసం ఎవరూ చేయలేదు!" రెడ్డిగొంతు వెన్నుపోటు దెబ్బతిన్న రాజకీయనాయకుడి గొంతులా పూడుకుపోయి బొంగురుపోయింది.

"ఏం జరిగింది రెడ్డీ?" అనునయంగా మళ్ళీ అడిగాను.

"....రాత్రి ఒంటిగంటకి ఆపిల్ల రమ్మని చెప్పిన ఎడ్రస్‌కే వెళ్ళాను. చీకట్లో గుమ్మంలోనే ఎదురు చూస్తూవుంది కాబోలు, నా చెయ్యి పట్టుకుని రిసీవ్ చేసుకుని లోపలకి తీసుకెళ్ళింది. గదిలో లైటు వెయ్యమంటే - 'ప్లీజ్ నో లైట్' అంది. చెవిలో స్వీట్ నథింగ్స్ చెప్పబోతే - 'పక్కవాటా వాళ్ళు వింటారు - మాటలు వద్దు ప్లీజ్!" అంటూ సుతారంగా నా నోరు మూసి మీదకు లాక్కుంది. ఆ పిల్ల 'అటువంటి బాపతు' కాదు అని నువ్వన్న మాటలు గుర్తొచ్చాయి. నీ అంచనా తప్పు అని నిరూపించాను అని నవ్వుకుంటూ విజృంభించాను...ఎంతో సంతృప్తిగా లేచి లైటర్ తీసి సిగరెట్ ముట్టించాను.

అప్పుడు,చూశాను ఆ వెలుగులో ఆ ముఖాన్ని!... అంత కురూపి ఆడదాన్ని నా జన్మలో చూడలేదు ! అసహ్యంతో నా వళ్లు జలదరించింది... ఎంత దగా! ... వంచన! తనకు బదులు ఒక కూరూపి బజారు వేశ్యని పంపి ఇంత మోసం చేస్తుందా!... డెవిల్...!! ఉద్రేకంతో ఊగిపోతున్నాడు రెడ్డి !!.

" లతకు డబ్బిచ్చావా రెడ్డి?" ఫ్లాస్కులోంచి కప్పులోకి కాఫీ వంచి ఇస్తూ అడిగాను.

"మొదట ఒప్పుకున్నప్పుడే ఇవ్వబోతే - 'అపుడు' ఇద్దురుగాని అంటూ తీసుకోలేదు."

" ఆ పిల్ల నీ డబ్బు తీసుకోనప్పుడు 'దగా' అనే ప్రశ్న ఎక్కడుంది రెడ్డీ ?"

రెడ్డి నావంక చాలా కోపంగా చూశాడు. "దాన్ని... దాన్ని సమర్థించకు తనేమన్నా బలవంతం చేశానా? తనకు ఇష్టం లేకపోతే ముందే నిష్కర్షగా ఆ మాట చెప్పొచ్చుగా - ఈ మోసం దేనికి? ... ఆ కురూపితో ఎలా ఇదయ్యానో తలుచుకుంటే నా మీద నాకే జుగుప్సగా ఉంది..!"

" అదేమిటి రెడ్డీ, ఎంతో సంతృప్తి చెందానన్నావే నీ నోటితోనే !"

" అవును. ముఖాన్ని చూడక ముందు చీకట్లో ఆ మనిషి లతే అనుకున్నాను... అందుకే సంతృప్తి చెందానన్నాను" తలవంచుకు చెప్పాడు అసహనంగా రెడ్డి.

"- అక్కడే కాస్తాగు రెడ్డీ, చీకట్లో ఆ స్త్రీ నువ్వనుకున్న అందగత్తే అనుకుని సుఖిం చావ్! ఆ మనిషి నువ్వనుకున్న అందగత్తె కాదనీ, ఓ కురూపి అని తెలిసాకా జుగుప్సతో అసహ్యించుకున్నావ్! నా ఊహలతో నిమిత్తం లేకుండా ఆ రెండు పరస్పర విరుద్ధమైన అనుభూతుల్ని కలగ చేసింది ఆ ఒక్క స్త్రీయే. నువ్వు చీకట్లో పొందిన సుఖం సత్యమా? లేక వెలుగులో చూసి పొందిన జుగుప్స సత్యమా. చెప్పగలవా రెడ్డీ? నువ్వనుభవించిన సుఖానికి గానీ, జుగుప్సకి గానీ మూలం నీ మానసిక స్థితే తప్ప ఆ స్త్రీ శరీరంకానీ, కురూపితనంగానీ కారణం కాదు. ఆనందం కానీ, అసహ్యంగానీ నిజానికి బయట ప్రపంచంలో లేవు రెడ్డీ. అవి మన మనసులోపలివే, మన భావాల ప్రతి రూపాలే. ఐతే అందం, అనాకారితనం అనేవి లోకంలో లేవా అని నువ్వడగవచ్చు. కానీ అందానికి నిర్వచనం ఏమిటి? అందానికి కొలబద్దలు ఏవిటి? అందం వస్తుగతమూ, దేహగతమూనా లేక మన నేత్రగతమా? ఒకరి దృష్టికి కురూపి మరొకరికి అందగత్తె! అందగత్తెకైనా, అనాకారికైనా ఆ పల్చని చర్మం వెనక అందరికీ వుండేవి అవే రక్తమాంసాలు, అవే కండరాల పోగులు. అందగత్తె సుఖాన్నిస్తుందను కోవడమూ భ్రమే, కురూపి వికారాన్ని కలిగిస్తుందనుకోవడమూ భ్రమే. అందం...వికారం సాపేక్షభావాలే. మన మనోవికారాలని బాహ్యప్రపంచానికి అన్వయించ పూనుకోవడం దుస్సాహసం రెడ్డీ.

ఇక మోసం, దగా, వంచన అన్నావే, అందులో లత పాత్రేమీ లేదు. నువ్వు లతని వెదికిపట్టుకుని ప్రలోభపెట్టి, వత్తిడి చేసిన మరునాడే లత ఈ విషయం నాకు చెప్పి బాధపడింది. ఆ తర్వాత కథ నడిపించింది నేనే రెడ్డీ..."

రెడ్డి షాక్ తిన్నట్టు చివాల్న తలెత్తి చూసాడు. చీకట్లో భయపెట్టే పులికళ్ళలా వున్నాయి అతని కళ్ళు.

"మనుషులంటే పైకి కన్పించే రూపాలు మాత్రమేననీ, జీవితమంటే సుఖా ల్ని కొనుక్కోవడమే అనుకునే నిన్ను సంస్కరించుకోవడం నా బాధ్యత అని భావించాను రెడ్డీ. పొట్టగడవడమే చాలా కష్టమయ్యే లత లాటి పేదపిల్ల ఓ గంట అనుభవానికి వెయ్యిరూపాయలు పారేస్తానంటే ఎగిరి నీవళ్ళో వాలుతుందని నీ ఊహ! నీ లాజిక్ ప్రకారం నీ ఊహరైటే. కానీ జీవితం నీ పరిమితమైన లాజిక్కులకీ, మేజిక్కులకీ లొంగనంతటి సంక్లిష్టమైనది రెడ్డీ. నేను చేసినపని నేరమనీ, మిత్రద్రోహమనీ భావిస్తే, నువ్వు విధించే ఏశిక్షనైనా భరించడానికి సిద్ధంగా వున్నాను మిత్రమా."

**నువ్వు చీకట్లో పొందిన సుఖం సత్యమా? లేక వెలుగులో చూసి పొందిన జుగుప్స సత్యమా. చెప్పగలవా రెడ్డీ? నువ్వనుభవించిన సుఖానికి గానీ, జుగుప్సకి గానీ మూలం నీ మానసిక స్థితే తప్ప ఆ స్త్రీ శరీరంకానీ, కురూపితనంగానీ కారణం కాదు. ఆనందం కానీ, అసహ్యంగానీ నిజానికి బయట ప్రపంచంలో లేవు రెడ్డీ. అవి మన మనసులోపలివే, మన భావాల ప్రతి రూపాలే. ఐతే అందం, అనాకారితనం అనేవి లోకంలో లేవా అని నువ్వడగవచ్చు. కానీ అందానికి నిర్వచనం ఏమిటి? అందానికి కొలబద్దలు ఏవిటి? అందం వస్తుగతమూ, దేహగతమూనా లేక మన నేత్రగతమా?**

సీలింగ్‌ఫాన్ మీద కిచకిచలాడుతూన్న పిచికల జంటవంక చూస్తూ రెడ్డి రియాక్షన్ కోసం ఎదురు చూస్తున్నాను. రెడ్డి సంగతి నాకు బాగా తెలుసు. రెడ్డి మోసాన్నీ, అవమానాన్నీ సహించి వూరుకునే మనిషికాడు. చిన్న విషయానికోసారి యూనివర్శిటీ లో ప్రొఫెసర్ పైనే చెయ్యి చేసుకున్న ఘనుడు. నన్ను మాత్రం వదుల్తాడా? కానీ నేను చేసిన పనికి రెడ్డి నన్ను కొట్టదలిస్తే అతని క్రోధం తీరదు. ఎందుకంటే ఒక్కదెబ్బకి మంచి నీళ్ళడక్కుండా పరలోకం చేరే అర్భకుడ్ని.

రెడ్డి ఎపుడు లేచివెళ్ళిపోయాడో నాకు తెలియలేదు. మళ్ళా రూమ్‌కి తిరిగి రాలేదు. నాకు భయం పట్టుకుంది నా భయం లత గురించి. నా పై కోపం, పగ లతపైన చూపిస్తాడా? లతని అర్భకుడ్ని నేనెలా కాపాడగలను? తెలివితక్కువగా లతని పెనం మీంచి పొయ్యిలోకి తోసానా అన్పించింది. బాత్రూంలో పేరుకుపోయిన సబ్బుల గుట్ట అలాగే పడివుంది.

** * **

నెల్లాళ్ళ తర్వాత రెడ్డి పెళ్ళి కబురు విని ఆశ్చర్యపోయాను. రెడ్డి నా కూడా కాత్యాయని ని తప్పకుండా తీసుకురమ్మని కబురు చేసాడు. పెళ్ళంటే తీవ్ర విముఖత్వం చూపే రెడ్డికి పెళ్ళా? నన్నేమీ చేయకుండా రెడ్డి నన్నొదిలి పెట్టినట్టేనా? రెడ్డి పెళ్ళంటే భారీ ఎత్తు నేనే. వేలమంది హైక్లాస్ అతిథులొస్తారు. కాత్యాయని ఫొటోని చూసి 'గొప్ప వికారి!' అని వెటకారించిన రెడ్డి కాత్యాని తప్పకుండా తీసుకురమ్మనడంలో ఆంతర్యం ఏమిటి? అందం, ఐశ్వర్యంగల తన భార్యని నా కాత్యా పక్కన నిలబెట్టి చూపించి పదిమందిలో నన్ను అపహాస్యం చేయడానికా ఈ పిలుపు? ఏశిక్ష విధించినా ఆనందంగా అనుభవి స్తానని చెప్పిన నేను ఇపుడు రెడ్డి అవమానిస్తాడని భయపడ్తున్నానా? ఏదైనా వెళ్ళాలనే నిశ్చయించాను.

ఆ పెళ్ళికి రిక్షాలోంచి దిగింది నేనూ కాత్యా మాత్రమే, పెళ్ళి పందిరికి చుట్టుపక్కల వీధులన్నీ కార్లలో నిండిపోయాయి. రిసెప్షన్లో పదుల వేలరూపాయల ఖరీదైన చీరల్లో సీతాకోకచిలుకల్లా వున్న ఆడపిల్లలు నన్నూ, నాచేతిని పట్టుకుని బెరుగ్గా చూస్తూన్న కాత్యానీ చూసి మాకు స్వాగతం చెప్పి సెంటుపూసి గులాబీ లు ఇవ్వాలో ఇవ్వక్కర్లేదో అని అనుమానంలో పడ్డారు. దూరంగా వేదికపైన పెళ్ళికొడుకూ, పెళ్ళికూతురూ కొంగు లు ముడివేసుకుని వివాహ మండపం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. కాత్యాతో మండపం వైపు నడిచాను.

రెడ్డి ఆస్థికీ, అంతస్థుకీ తగినదై వుండి, పెర్‌ఫెక్ట్ ఫిగరై వుండి, ఎలిజబెత్ టేలరూ, సోఫియా లారెన్స్‌ల అందాల్ని కలబోసుకున్న ఆ అపురూపమైన అందగత్తెని చూడాలనే సహజమైన కుతుహలంతో మరింత ముందుకు నడిచాను. రెడ్డి గురించి నాలాజిక్ తప్పింది! ఆ వధువు లత! కానీ పోలియో వాతపడిన కాలి సపోర్ట్‌కోసం లత కుడిచేతికింద ఎపుడూ వుండే ఊతకర్రమాత్రం లేదు.

లతకి తనే ఊతకర్ర అయినట్టు ఆమెను అపురూపంగా పొదివి పట్టుకుని వేదిక చుట్టూ నడిపిస్తున్నాడు రెడ్డి!